


“అమ్మా!” అర్చాడతను దీనంగా.

హాల్లో వున్న మంగమ్మ గుమ్మం దాటి ముందు వరండా మీదకు వెళ్ళింది.

పన్నెండేళ్ళ కుర్రాడు! అతడి ఒంటిమీదున్న నిక్కరు, బనీను బాగా మాసి, చిరిగిపోయాయి. నీరసంగా వున్నాడతను.

“ఏమిటి కావాలి?”

“కొంచెం అన్నం పెట్టండమ్మా! ఆకల్తో మాడ్తున్నానమ్మా!”

“దుమ్మరగుండులా వున్నావు! ఏదేనా పని చేసుకోకూడదూ?” అందామె.

“పనివ్వండమ్మా, చేస్తాను,” అన్నాడతను.

ఆమె ఆలోచిస్తూ అతడివంక చూసింది. పనిమనిషి జీతం ఎక్కువ చెయ్యమని, చేయనంటే పని మానేసింది. ఒకపూట కాఫీ యిచ్చి, తిండిపెట్టి యిరవై రూపాయిలిచ్చినా పనిమనిషికి తృప్తి లేదు. ఇరవై అయిదు కావాలిట!

“ఇక్కడుండి నేను చెప్పినపనులు చేస్తూ వుంటావా?” అడిగిందామె.

“చేస్తానమ్మా.”

“జీతం ఎంత కావాలి?”

“జీతం ఏంటమ్మా! నాచేత పని చేయించుకోండి. ఎంతిచ్చినా సరేనమ్మా!”

“పేరు?”

“మల్లయ్యమ్మా. అందరూ మల్లీ అని పిలుస్తారు.

“తర్వాత పోట్లాడ్డం నా కిష్టంలేదు. అంతా యిప్పుడే చెప్తాను. మునపటి పనిమనిషికి ఎనిమిది రూపాయలిచ్చేదాన్ని. పొద్దుట బెల్లంకాఫీ పోసేదాన్ని. నీకు పదిరూపాయలిస్తాను. రెండుపూట్లా భోజనం పెడ్తాను. వరండాలో నువ్వు పడుకోవచ్చు.”

“అలాగే నమ్మా.”

“నీకు తలిదండ్రులున్నారా?”

“నాన్న పోయేడమ్మా. అమ్మ మరొకడిని పెళ్లాడింది. వాడు నన్ను గుడిసెలోంచి తరిమేశాడు. అందుకే పట్నం వచ్చేశాను.”

“నువ్వు చదువుకున్నావా?”

“రెండవ క్లాసు చదువుతూ మానేశానమ్మా.”

“అలా తిరిగి పెరట్లోకి రా. అంట పాత్రలు పడేస్తాను,” అందామె.

“నాకో ముద్ద పెట్టండమ్మా. తర్వాత ఎంత పనేనా చేస్తాను,” అన్నాడు మల్లయ్య.

“అలారా,” అంది మంగమ్మ.

ఆమె విస్తరాకులో పెట్టిన చల్ది అన్నాన్ని అతడు మహాప్రసాదంలా తిన్నాడు. ప్లాస్టిక్ డొక్కులోని నీళ్ళు తాగేశాడు. ఆకలి తీరింది.

పని మొదలెట్టాడు, పన్నెండున్నర

దాకా ఆ పనీ,యీపనీ చేశాడు. కేరియర్, వాటర్ బాగ్ ఆమె అతని కిచ్చింది. చెట్టియార్ స్కూల్‌కి ఎలా వెళ్ళాలో చెప్పింది.

“ఈ కేరియర్, వాటర్ బాగ్ చూసి రాజా నిన్ను పోలుస్తాడు. వాడికిచ్చి, తిన్నాక, అన్నీ పట్రా” అందామె.

మల్లయ్య వాటిని పట్టుకుని గేటు వైపు అడుగులేశాడు. అతడికేసి చూస్తూ ఆమె వరండామీద నిలబడింది. వాడు ధరించిన దుస్తులు మరీ మురికిగా వున్నాయి. అటువంటి మురికిదుస్తుల వాడికిచ్చి కేరియర్ పంపినందుకు రాజా ఏమన్నా అంటాడేమో? మల్లయ్యకి ఒక నిక్కరూ, బనియనూ ఇవ్వాలి. ఇప్పుడే యిస్తే లాభంలేదు. కొన్నిరోజులు వాడి పని చూసినతర్వాత యివ్వాలి!


మల్లయ్య స్కూలు గేటుముందు దిక్కులుచూస్తూ నిలబడ్డాడు. బెల్ కొట్టారు. కొంతమంది విద్యార్థులు బైటకుపోతూ, అతడిని చూసి జేబు రుమాళ్ళతో ముక్కులు మూసుకున్నారు.

“అమ్మ నీకిచ్చి ఎందుకు పంపింది?” అడిగాడు రాజా.

“తెలువదు బాబూ,” అన్నాడు మల్లయ్య.

అతడ్ని బయటనే వుండమని చెప్పి, కేరియర్, వాటర్ బాగ్ తీసుకుని రాజా లోపలికి వెళ్ళాడు.

సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. ఎండలో నిలబడితే పాదాలు కాల్తున్నాయి. రోడ్డు కటువైపున్న నిద్రగన్నేరు చెట్టుకిందకి వెళ్ళి మల్లయ్య నేలమీద కూర్చున్నాడు. పలువైపులా చూస్తున్నాడు. దూరంలో స్కూలుపిల్లలు నవ్వుతూ ఆడుకుంటున్నారు. రాజా అతడికి గుర్తుకొచ్చాడు. రాజా నిజంగా రాజాలాగే వున్నాడు. బూ నిక్కరు, తెల్ల షర్టు! నడుముకి




వెడల్పయిన బెల్టు, కాళ్ళకు సాక్సు, మెరుస్తున్న బూట్లు, చేతికి పెద్ద వాచ్ మెళ్ళో బంగారం గొలుసు. ఇదంతా జ్ఞాపకం చేసుకుంటూ తనకు తెలీకుండానే మల్లయ్య నేలమీద నిద్రపోయాడు. అతడి కాళ్ళమీద ఎర్రచీమలు పాకుతున్నాయి! కానీ అతడికి మెలుకువ రాలేదు!

ఎవరో అతడ్ని గట్టిగా తట్టిలేపారు. తృళ్ళిపడుతూ మల్లయ్య లేచాడు. ఎదురుగా రాజా నిలబడి వున్నాడు.

“ఈ కేరియర్, వాటర్ బాగ్ పట్టుకెళ్ళి ఇంట్లో ఇచ్చేయి. మురికివెధవ్వ, నువ్వు మళ్ళా కేరియర్ పట్టుకుని రాకు. నీ మొహంచూస్తే ఉన్న ఆకలి కూడా హరించిపోతుంది,” అన్నాడు రాజా హేళనగా.

మాట్లాడకుండా మల్లయ్య ఇంటికి నడవసాగాడు.

సాయంత్రం ఆరింటికి ఆమె భర్త స్కూటర్‌మీంచి దిగి లోపలికి వచ్చి సోఫాలో ఫాన్‌కింద కూర్చున్నాడు. టిఫిన్ తెచ్చి ఆమె అతడి కిచ్చింది. నవ్వుతూ ఎదురుగా కూర్చుంది.

“కొత్తగా ఒక కుర్రాడిని పనికి పెట్టాను. వాడిని చూశారా?” అడిగిందామె.

“కనిపించాడు. ముక్కులకి నీళ్ళోస్తున్నాడు. మంగీ, వాడి ఒంటిమీద ఉన్న దుస్తులను వెంటనే తీసి పారెయ్యమను. రాజా పాతనిక్కర్లు, షర్టులు మనింట్లో చాలా వుంటాయి. రెండు మూడు జతలు వాడికిచ్చి, నీట్‌గా వుండడం నేర్పు,” అన్నాడు లింగమూర్తి.

“అమాత్రం నాకు తెలియదుటండీ? మొదటిరోజునే అన్నీ యిస్తే వాడికి కొమ్ములు వస్తాయి!”

“వాడి మురికిబట్టలు చూస్తే మనకి తుమ్ములొస్తాయి!” అన్నాడు లింగమూర్తి నవ్వుతూ.

మంగమ్మ నవ్వుతూ లోపలికెళ్ళి కాఫీ తెచ్చి అతనికి యిచ్చింది.

“ఇంతకీ వాడెవడు?” అడిగాడతను.

“ఈ ఊరివాడు కాదు.”

“మంగీ, ముక్కూ మొహం తెలీని వాళ్ళ విషయంలో మనం జాగ్రత్తగా వుండాలి. పనిచేస్తామని వస్తారు. ఏ పర్సో పట్టుకొని పారిపోతారు.”

“వాడిని నేను యింట్లోకి రానివ్వను లెండి,” అందామె సగర్వంగా.

రోజులు దొర్లిపోతున్నాయి. ఇప్పుడు మల్లయ్య నీట్‌గా కనిపిస్తున్నాడు. ఒళ్ళువంచి అన్ని పనులు సవ్యంగా చేసుకుపోతున్నాడు. ఎన్ని పనులు

చెప్పినా మునపటి మనిషిలా విసుక్కునే వాడు కాదు. నవ్వుతూ చేసేవాడు.

ఆ రోజు బుధవారం. రాజాకి కేరియర్ ఆమె స్కూలికి పంపలేదు. పన్నెండింటికే రాజా స్కూలునుంచి యింటికి వచ్చాడు.

"తొందరగా అన్నంపెట్టమ్మా. మళ్ళా స్కూలికి వెళ్ళాలి," అన్నాడు రాజా.

ఆమె ముందుగుమ్మంవైపు వెళ్ళింది. వరండామీద మల్లయ్య కూర్చుని ఉన్నాడు.

"మల్లయ్యా, లోపలికిరాకు. అక్కడే కూర్చో!" అని ఆమె తలుపులను మూసి గడియలు పెట్టింది.

కునికిపాట్లు పడుతూ మల్లయ్య వరండామీద కూర్చున్నాడు. భోజనం ముగించి, తలుపులు తెరుచుకుని రాజా బయటకు వచ్చాడు.

"తలుపేసుకో, అమ్మా!" అని గట్టిగా అర్చాడు.

రాజా చెయ్యి నిక్కర్ జేబులోకి వెళ్ళింది. అతడి చేతిలో ఉన్నదాన్ని మల్లయ్య చూడగలిగాడు.

మల్లయ్యకి చాలా ఆకలిగా వుంది. ఆమె తిండి ఎప్పుడు పెడుతుందో! నిమిషాలు గడిచిపోతున్నాయి.

"ఒరే మల్లయ్యా!" పిల్చిందామె.

"వస్తున్నానమ్మా!" అన్నాడతను.

అతడు లేచాడు. ఆమె గబగబా అతని ముందుకు వచ్చింది. అతడివైపు కోపంగా చూసింది.

"దొంగవెధవా, లోపలకు వెళ్ళావా?" అడిగింది.

"లేదమ్మా!"

ఆమె అతడి జేబుల్ని తడిమి చూసింది. వెనుతిరిగి లోపలకు పరుగెత్తింది. చీపురు పట్టుకుని తిరిగొచ్చింది.

"చేతులు కట్టుకుని నుంచో!"

ఆమె చెప్పినట్లే చేశాడతను.

"ఇదిగో నిజం చెప్పు! పడగ్గదిలో టేబుల్‌మీద నేను వందరూపాయలనోటు పెట్టాను. అది లేదు. దాన్నేంచేశావు! ఎక్కడ దాచావు?" కోపంగా అరిచిందామె.

"నేను లోపలకు రాలేదమ్మా. దాన్ని ముట్టలేదమ్మా!" అన్నాడు మల్లయ్య.

చీపురు పిడితో అతని తలమీద పదిసార్లు కొట్టిందామె. మల్లయ్య మౌనంగా దెబ్బలు భరించాడు.

"చెప్పరా దొంగవెధవా!"

"నాకేం తెలవదమ్మా!" బవాబిచ్చాడతను.

ఏదో చప్పుడయి ఆమె వంటింట్లోకి పరుగెత్తింది. టేబుల్‌మీదున్న పాలను పిల్లి తాగుతోంది. ఆమె పిల్లిమీదకు చీపురు విసిరింది. పిల్లి క్షణంలో పారిపోయింది.

పాలగిన్నెమీద బరువైన మూత బెట్టి, వీధి వరండా మీదకు చీపురు పట్టుకుని ఆమె వెళ్ళింది. అక్కడ మల్లయ్య లేడు. అతడికోసం నలువైపులా చూసింది. ఎక్కడా అతడి రూపం కనిపించలేదు. "దొంగవెధవ, పిల్లిలా పారిపోయాడు" అనుకుందామె.

స్కూలు పక్కనున్న షాపుముందు నిలబడి రాజా కూల్‌డ్రింక్ తాగుతున్నాడు. మల్లయ్య గబగబా అతని దగ్గరకు వెళ్ళాడు.

"అమ్మగారు అర్జంటుగా నిన్ను రమ్మన్నారు, బాబూ," అన్నాడు మల్లయ్య.

"నాకు క్లాసుంది. నేను రాలేను," అన్నాడు రాజా.

"ఎంత పనున్నా తీసుకురమ్మన్నారు, బాబూ," అన్నాడు మల్లయ్య.

విసుక్కుంటూ రాజా అతడితో ఇంటికి వెళ్ళాడు. ముందు వరండామీద నిలబడివున్న మంగమ్మ వాళ్ళిద్దరివైపూ ఆశ్చర్యంగా చూసింది.

"అమ్మా, నన్ను రమ్మన్నావా? ఎందుకూ!" అడిగాడు రాజా ఆశ్చర్యంగా.

మల్లయ్య ఆమె దగ్గరగా జరిగాడు.

"అమ్మా, మీరు పోయిందన్న నోటు బాబుజేబులో ఉంటుందమ్మా," అన్నాడు మల్లయ్య.

"ఏంరా రాజా, వందరూపాయిల నోటు నువ్వు తీశావా?" అడిగింది మంగమ్మ.

"నా కేందుకమ్మా ? దొంగవెధవ వాడేదో అంటే నువ్వు పట్టించుకో కూడదు!" అన్నాడు రాజా.

రాజా గాభరాపడుతున్నాడని ఆమె గ్రహించింది. అతడిని ఆమె లోపలకు తీసుకు వెళ్ళింది.

పడగ్గదిలో రాజా జేబులను ఆమె వెతికింది. అతడి జేబులో తొంభై ఎనిమిది రూపాయిలు ఉన్నాయి!

"ఇదేం పన్నా ? ఆ మల్లయ్యగాడిని చీపుర్తో ఎడాపెడా కొట్టాను. నోటును దొంగిలించాడనుకున్నాను.వాడు చెప్పింది నిజమే. నువ్వు దొంగవు! వాడిముందు నీకెంత అవమానం?" అందామె.

రాజా ఏడ్చాడు. కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి.

"నాన్నలా వందరూపాయల నోటు జేబులో పెట్టుకుని స్కూలుకు వెళ్ళాలనిపించిందమ్మా. పట్టుకు వెళ్ళాను," అన్నాడు రాజా.

చీరకొంగుతో ఆమె అతడి కన్నీళ్ళు తుడిచింది. "వెళ్ళు బాబూ! మరేం ఫరవా లేదులే," అందామె.

బయట నిలబడిన మల్లయ్యవైపు చూడకుండా రాజా గబగబా వెళ్ళిపోయాడు.

"ఒరే మల్లయ్యా వెనక్కి రా, అన్నంపెడతా." అర్చిందామె.

మౌనంగా అతడు వెనకవైపు వెళ్ళాడు.

* * *

రోజులు దొర్లిపోతున్నాయి

మల్లయ్యను చూస్తే రాజాకి ఒళ్ళు మండుతోంది. మల్లయ్య చూపులను అతడు భరించలేకపోతున్నాడు!

'నువ్వు దొంగవు!' అని గేలి చేస్తున్నట్లు, నిందిస్తున్నట్లు వుంటుం దతనిచూపు, రాజా దృష్టిలో.

ఒకరోజున తన బూట్లను పాలిష్ చేయమన్నాడు రాజా. మల్లయ్య ముందు వరండాలో కూర్చుని బూట్లను పాలిష్ చేస్తున్నాడు.

"ఫూల్, నీ కేపనీ తెలియదురా! చవట వెధవ్వు!" అర్చాడు రాజా.

మల్లయ్య చేసినదానిలో ఏతప్పూ లేకపోయినా రాజా అతడిని తిట్టేవాడు, దండించేవాడు.

తల్లితో ఒకనాడు మొరపెట్టుకున్నాడు రాజా.

"అమ్మా, వాడీయింట్లో వుంటే నాకు మనశ్శాంతి లేదమ్మా. నేను దొంగ నన్నట్లు నావైపు చూస్తాడు. వాడిని పొమ్మనమ్మా!" అన్నాడు రాజా.

ఆనాటిసాయంత్రం ఆమెమల్లయ్యకు జీతంయిచ్చి, పొమ్మంది.

"ఎందుకు పొమ్మంటున్నా రమ్మా? నేనేదేనా తప్పుచేశానా?" అడిగాడతను.


"లేదురా! మాకు పనిమనిషి యిప్పు డనవసరం. మరోవూరికి పోతున్నాం," అందామె.

"అలాగయితే పర్లేదమ్మా,పోతాను" అని అతను ఆమెకు నమస్కరించి వెళ్ళిపోయాడు.

తల్లీ కొడుకూ ముందువరండాలో కూర్చున్నారు.

"శని విరగడైంది!" అన్నాడు రాజా.

"వాడిక రాడు. బెంగెట్టుకోకు,"అంది తల్లి.



చీకటి పడింది. ఆమె స్విచ్ని నొక్కింది. ఫ్లోరసెంట్ లైట్లువెలిగింది. ఎవరో గేటుదాటి లోపలకు వస్తున్నారు. తల్లీ, కొడుకూ వాళ్ళవైపు ఆశ్చర్యంగా చూశారు.

మల్లయ్య స్కూటర్ని తోసుకొస్తు న్నాడు. పక్కనే కుంటుతూ నడుస్తు న్నాడు లింగమూర్తి

"ఏమయింది?" అర్చిందామె.

"యాక్సిడెంటయి కిందపడ్డానే? స్కూటర్ని కొట్టిన లారీ దూసుకు పోయింది. రోడ్డుమీద ఎవ్వరూ లేరు. లక్కీ, మల్లయ్య అటు వెళ్తూ నన్ను చూశాడు. సోడాతెచ్చి నా నోట్లోపోశాడు నేను మెల్లిగా లేచాను. ఇద్దరం యింటికి చేరుకున్నాం," అన్నాడతను.

మల్లయ్యను చూడగానే రాజాగుండె దడదడలాడింది!

మల్లయ్య చేతులెత్తి లింగమూర్తికి నమస్కరించాడు.

"వెళ్తానయ్యా. అమ్మగారు పొమ్మ న్నారు," అన్నాడతను.

"ఎక్కడికీ పోకురా! నువ్వ యిక్కడే వుండాలి," అన్నాడు లింగమూర్తి.

రాజా తల్లిచెయ్యి పట్టుకున్నాడు. ఆమె భర్తతో లోపలకు వెళ్ళింది. అతడు పరుపుమీద పడుకున్నాడు. ఆమె పక్కనే కూర్చుంది.

"రాజాకి మల్లయ్యంటే యిష్టంలేదు. వాడిక్కడ వుండకూడ దన్నాడు. మల్లయ్యవుంటే తానీయింట్లో వుండలే నన్నాడు. అందుకని వాడిని పొమ్మ న్నాను," అందామె.

"మంగీ, నువ్వు తప్పుచేశావు. రాజా చెప్పినట్లు నువ్వు చేస్తే వాడు ఎందుకూ పనికిరాని వాడవుతాడు. మల్లయ్యంటే వాడికి గిట్టకపోవచ్చు. ఈ లోకంలో మనకిష్టంలేని ఎంతమందితోనో మనం కలిసి బ్రతకాలి. అలా మల్లయ్యతో కలిసి బతకడం నేర్చుకోమని రాజాకు చెప్పు. ఆ క్రమశిక్షణ వాడికి వుపయోగ పడ్తుంది," అన్నాడతను.

"అలాగే చెప్తాను," అందామె.

"డాక్టర్కి ఫోన్చేసి వెంటనే యిక్కడికి రమ్మను," అన్నాడతను.